సాక్షి మంచిర్యాల

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



మత్తు అలజడి

బెల్లంపల్లి మున్సిపాల్టీ, చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయి గుప్పుమంటోంది. నిర్మానుష్య, శివారు ప్రాంతాలు, పాడుబడిన ఇళ్లలో కొందరు గంజాయి దమ్ము కొడుతున్నారు. 8లో ▸



భగీరథ.. నీరంతా వృథా

వేసవి తీవ్రతతో ఓ వైపు నీటి కోసం ప్రజలు అల్లాడుతుండగా.. మరోవైపు మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు ఏర్పడి నీరు వృథా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0 /25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు



జిల్లా జడ్జితో న్యాయవాదులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, నూతన కమిటీ సభ్యులు జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ లక్సెట్టిపేట కోర్టు ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్నందున వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. కోర్టు భవనంలో మరమ్మతులు త్వరగా జరిపించాలని జడ్జికి విన్నవించారు. అనంతరం జడ్జిని శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలేకు భారతరత్న ప్రకటించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పాతమంచిర్యాల: మహాత్మా జ్యోతిబా పూలేకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని, ఆయన జయంతి రోజున సెలవు ప్రకటించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏఓ రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవివక్ష, అంటరానితనం నిర్మూలన కోసం ఉద్యమాలు చేసి సమసమాజ స్థాపనకు కృషి చేశారని తెలిపారు. జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారని, ఆ మహనీయునికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ సరైన గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించి గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు కొంతం రాజు, మహేష్, అంకం సతీష్, తోకల వెంకటేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ కమిటీ సమావేశాలు వాయిదా



సమావేశంలో జెడ్పీ సీఈవో వి.గణపతి

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ కమిటీ సమావేశాలు సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడ్డాయి. బుధవారం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈవో వి.గణపతి ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఏడు స్థాయీ కమిటీ సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా.. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీతోపాటు వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశంలో ఎలాంటి తీర్మానాలకు అవకాశం లేకపోవడంతో ప్రజాప్రతినిధులు గైర్హాజరైనట్లు తెలిసింది.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఎన్నిక చెల్లదు



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఒలింపిక్ సంఘానికి సమాచారం ఇవ్వకుండా తమకు తాముగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్న ఎన్నిక చెల్లదని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసుకున్న హ్యాండ్‌బాల్ ఎన్నికలు పూర్తి విరుద్ధమని, ఈ ఎన్నికలకు ఒలింపిక్ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు. జిల్లాలో ఒలింపిక్ సంఘానికి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అనుబంధంగా ఉందని, దీనికి ఇప్పటికే అధ్యక్షులుగా గోనె శ్యాంసుందర్‌రావుతోపాటు కార్యవర్గ సభ్యులు కొనసాగుతున్నారని తెలిపారు. జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి అనుబంధంగా కొనసాగుతున్న సంఘమే నిజమైందని, క్రీడాకారులను సంఘం పేరిట అయోమయానికి గురిచేస్తున్న ఆ సంఘంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కనపర్తి రమేశ్, ఈ.రాంచందర్, తైక్వాండో సెక్రెటరీ రాజేశ్, మైలారం శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ సుధాకర్, పి.రఘునాథ్, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం!



కొప్పుల ఈశ్వర్

గడ్డం వంశీకృష్ణ

గోమాసే శ్రీనివాస్

- వేగం పెంచిన ఎంపీ అభ్యర్థులు
- అధికార, విపక్ష నాయకుల పోటాపోటీ
- ప్రజా మద్దతు కోసం పలు కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. మరో వారం రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలు వేగవంతం చేశారు. గత కొద్ది రోజులుగా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు దూకుడు పెంచారు. వేసవి ఎండలను లెక్క చేయకుండా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలియదిరుగుతున్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లు, విందులు, శుభకార్యాలు, పర్వదినాలకు హాజరవుతున్నారు. ఎండకాలంలోనూ రోజంతా తీరిక లేకుండా గడిపేస్తున్నారు.

వంశీకి ఎమ్మెల్యేల బలం

కాంగ్రెస్ పార్టీలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి అవకాశం కల్పించడంపై ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణపై అసంతృప్తి కనిపించింది. ఈ ప్రభావం ఎన్నికలపై పడనున్న నేపథ్యంలో ఎక్కడికక్కడ సెట్ రైట్ చేస్తున్నారు. తనయుడి కోసం ఎమ్మెల్యే వివేక్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ నుంచి గల్లీదాకా అందరి సహకారం కోరుతున్నారు. ఇటీవల ఏడుగురు ఎమ్మెల్యేలు వంశీ గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటించారు. ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఉన్న అసంతృప్తి బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. మాదిగ సామాజికవర్గం నుంచి ఇంకా వ్యతిరేకత వస్తున్నప్పటికీ బుజ్జగింపులు నడుస్తున్నాయి. చాలామంది వెనక్కి తగ్గడం, వంశీకి ఎమ్మెల్యేల మద్దతు లభించడంతో కొండంత అండ దొరికినట్లు అయింది. దీంతో ఆయా నియోజకవర్గ నేతలను కలుస్తూ క్షేత్రస్థాయిలో బలం పెంచుకుంటున్నారు.

వ్యూహాత్మకంగా 'కొప్పుల'

మాజీ మంత్రి, సీనియర్ నాయకుడుగా ఉన్న కొప్పుల ఈశ్వర్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినప్పటి నుంచే ఎన్నికల రణంలోకి దిగారు. తమ పార్టీ నాయకులు వేరే పార్టీల్లో చేరుతున్నప్పటికీ పాత పరిచయాలు, ఇక్కడి పరిస్థితులను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీలు, రైతు సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామాలు, పట్టణాలు, కార్మిక క్షేత్రంలోనూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సమావేశాల్లో పాల్గొంటున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో గెలుపు కోసం ప్రణాళికలు వేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న వర్గపోరు తమకు కలసి వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. ప్రస్తుతం బరిలో ఉన్న ప్రధాన పార్టీల ముగ్గురు అభ్యర్థుల్లో 'కొప్పుల' సీనియర్‌గా ఉన్నారు. కార్మిక నాయకుడు, సుదీర్ఘ రాజకీయ అనుభవం తమకు కలసి వస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు నమ్మకంతో ముందుకెళ్తున్నారు.

దూకుడుగా 'గోమాసే'

పెద్దపల్లి స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని 'కమలం' పార్టీ నాయకులు విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. తమ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ నియోజకవర్గంలో బిజీ బిజీగా గడుపుతున్నారు. అయితే నియోజకవర్గాల్లో ఇప్పటికీ నాయకత్వలేమి ఉండడంతో సంస్థాగతంగా బలపడేందుకు చెమటోడుస్తున్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఆ పార్టీ నాయకులతో కార్యక్రమాలు చేపడుతూ దూకుడుగా ఉన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలపై ప్రచారం చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాను వాడుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై విమర్శలు చేస్తున్నారు. ఆ మేరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కమలనాథుల్లో ఉత్సాహాన్ని నింపి ఈ పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నారు.

గురుకులాల్లో బియ్యం లేవు..!



బెల్లంపల్లిలోని సీఓఈ కళాశాల భవనం

- సరిపడా సరఫరా కాని వైనం
- ప్రతీ నెల తిప్పలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ గురుకుల విద్యాలయాలకు సరిపడా బియ్యం సరఫరా కావడం లేదు. ఇండెంట్ ప్రకారం సరఫరా చేయకపోవడంతో విద్యార్థులకు భోజనం వండి పెట్టడానికి అరువుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పట్టణంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాల, సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల కళాశాల, ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల, బీసీ బాలికల గురుకుల కళాశాల, కస్తూర్బా బాలికల విద్యాలయాలు ఉన్నాయి. వీటికి నెలవారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పౌరసరఫరాల శాఖ బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. ముందుగానే ఇండెంట్ అందజేసినా ఆ ప్రకారం పంపిణీ చేయకుండా కొన్ని నెలలుగా తీవ్ర జాప్యం చేస్తున్నారు. గత మార్చి నెలకు సంబంధించి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాలకు 73 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా స్టాక్ లేదని 40 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేశారు. కాసిపేట సంక్షేమ బాలుర గురుకులంలో 55 క్వింటాళ్లకు 49 క్వింటాళ్లు, బెల్లంపల్లి సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయానికి 54 క్వింటాళ్లకు గాను 28 క్వింటాళ్లు పంపిణీ చేశారు. ఇండెంట్‌ను అనుసరించకుండా అత్తెసరుగా బియ్యం అందించడంతో గురుకుల నిర్వాహకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ మాసం వచ్చిన కూడా మార్చి నెల తాలూకు బియ్యం పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోగా, ఏప్రిల్ నెల బియ్యం కూడా ఇంకా పంపిణీ చేయకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో గురుకుల విద్యాలయాల నిర్వాహకులు మరోమార్గం లేక ఇతర విద్యాలయాల నుంచి అరువుతో బియ్యం తెచ్చుకుంటున్నారు. అరువు ఇచ్చిన విద్యాలయాల్లో సైతం బియ్యం నిండుకునే పరిస్థితులు ఏర్పడడంతో రోజువారీగా బెల్లంపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులకు ఫోన్ చేసి బియ్యం కోసం ఆరా తీయక తప్పడం లేదని చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ విద్యాసంస్థలకు విధిగా ప్రతీనెల సరిపడా బియ్యాన్ని సరఫరా చేయాల్సిన పౌర సరఫరాల శాఖ అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఏ నెలలో కూడా పూర్తి స్థాయిలో బియ్యం అందించిన దాఖలాలు లేవు. విద్యార్థులకు ఇక్కట్లు ఎదురవుతాయని తెలిసి కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రతీ నెల ఇండెంట్ ప్రకారం బియ్యం సరఫరా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

బియ్యం స్టాక్ లేక ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలకు ఇండెంట్ ప్రకారం పంపిణీ చేయలేకపోతున్నాం. కొన్ని గురుకులాలకు బియ్యం బ్యాలెన్స్ ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్టేజ్–1 దశకు బియ్యం పంపిణీ కోసం ఆదేశాలు వచ్చాయి. సాధ్యమైనంత వరకు విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా బియ్యం సకాలంలో అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఒకటి రెండు రోజుల్లో బ్యాలెన్స్ బియ్యం అందజేస్తాం.

– శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇంచార్జి, బెల్లంపల్లి

ప్రతీ ఇంటికి ఇంకుడుగుంత ఉండాలి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- నీటి సరఫరాపై క్షేత్రస్థాయిలో పరిశీలన

మంచిర్యాలటౌన్: ఇంటి నిర్మాణం సమయంలోనే ప్రతీ భవనానికి ఒక ఇంకుడుగుంత నిర్మించుకోవాలని, వేసవిలో నిరంతరం తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గోసేవ మండల్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ తాగునీటి సరఫరా నిర్వహణపై తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి నిరంతర నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పైప్‌లైన్ల లీకేజీ సమస్యలు, బోర్‌వెల్‌ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, డీఈ మధుకర్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ పరిధి కొత్తపల్లి మండల పరిషత్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరమ్మతు పనులతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, టీఎస్‌ఈడబ్ల్యూటీసీ చేపట్టే పనులను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని చెప్పారు. టీఎస్‌ఈడబ్ల్యూటీసీ ఈఈ అశోక్, డెప్యూటీ ఈఈ శ్రీనివాసగౌడ్, ఏఈ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎఫ్‌సీఐ గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో రైస్‌మిల్లులకు నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదామును జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి సందర్శించారు. సీఎంఆర్ దిగుమతి పెరిగే విధంగా ఎఫ్‌సీఐలో స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. వరిధాన్యాన్ని ట్యాగింగ్ కలిగిన రైస్‌మిల్లులకు వాటి సామర్థ్యానికి అనుగుణంగా తరలించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14నుంచి మే 12 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఓటరు జాబితాలో వివరాలు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.



బెల్లంపల్లిలో ప్రత్యేక నమాజ్ కోసం సిద్ధమైన ఈద్గా

నేడు రంజాన్

- ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాల్లో ఏర్పాట్లు
- ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు సిద్ధమైన ముస్లింలు

నెన్నెల: రంజాన్ ఉపవాస దీక్షలు ముగిసాయి. ముస్లింలు అత్యంత పవిత్రంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి బుధవారం నాటికి 30 రోజులు కావడంతోపాటు సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమిచ్చింది. దీంతో గురువారం రంజాన్ పండుగను జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. రంజాన్ దీక్షల అనంతరం షవ్వాల్ మాసం మొదటి రోజు నిర్వహించుకునే పండుగే ఈద్-ఉల్-ఫితర్. ఈ రోజు మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు.

ఫిత్రాదానం

పండుగ రోజు నమాజ్‌కు ముందు పేదలకు ఇచ్చే దానమే ఫిత్రా. ఉపవాసాల పాటింపులో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పొరపాట్లు, లోపాలు జరుగుతూనే ఉంటాయి. ఈ లోపాలను పరిహారం చేసేదే ఫిత్రాదానం. సమాజంలోని నిరుపేదలు మంచి వస్త్రాలు ధరించి, మంచి వంటకాలు ఆరగించే వీలు కల్పిస్తూ ముస్లింలు దానం చేస్తుంటారు.



మంచిర్యాల బస్టాండ్ ఈద్గా వద్ద ఏర్పాట్లు

మంచిర్యాలలో..

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. స్థానిక అండాళమ్మకాలనీ, బస్టాండ్ ముందర ఉన్న ఈద్గాల వద్ద చదును చేసే పనులతోపాటు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. వేసవి నేపథ్యంలో టెంట్లు వేశారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి నీటి సౌకర్యం కల్పించారు. తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈద్గాలను మున్సిపల్ అధికారులు, ముస్లిం మత పెద్దలు సందర్శించి పండుగ సందర్భంగా కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు.

నిరంతర నీటి సరఫరాకు చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఇతర శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో తాగునీటి ప్రణాళిక, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పాఠశాలల మరమ్మతులు, వడదెబ్బల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతర తాగునీటి సరఫరాకు మండల, గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని, చేతిపంపులు, బోర్‌వెల్ మరమ్మతులు చేపట్టాలని అన్నారు. బోర్‌వెల్, నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీరు సరఫరా చేయలేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ పద్ధతిలో వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని చెప్పారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. సీఎంఆర్ పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, మిల్లులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి.సంతోష్, అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, సీపీవో సత్యం, పౌరసరఫరాల మేనేజర్ గోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి ప్రేరణ పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక కేంద్రియ విద్యాలయంలో గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో ఏడు రోజుల శిక్షణకు జిల్లా నుంచి ఒక బాలుడు, బాలికను ఎంపిక చేసే నిమిత్తం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ పోటీలు ముగిసాయి. జిల్లాలోని 95పాఠశాలలకు చెందిన 77మంది బాలురు, 102 బాలికలు హాజరయ్యారు. వ్యాసరచన, చిత్రలేఖనం, డ్రాయింగ్, ఉపన్యాస, నృత్యం, గానం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన మొదటిరౌండ్‌లో ఓవరాల్‌గా 15 మంది బాలురు, 15 మంది బాలికలను ఎంపిక చేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఇంటర్వ్యూవ్ నిర్వహించారు. వివరాలన్నీ ఉన్నతాధికారులకు నివేదించారు. ఇందులో ఒక బాలుడు, ఒక బాలికను ఎంపిక చేసి వీరిద్దరితోపాటు ఎస్కార్ట్ టీచర్‌తో సహ త్వరలో శిక్షణలో పాల్గొననున్నారు. నోడల్ ఆఫీసర్, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ జె.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ క్వాలిటీ కో–ఆర్డినేటర్‌గా సత్యనారాయణమూర్తి వ్యవహరించారు.




ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు
- పట్టణంలో పనుల పరిశీలన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని హమాలీవాడ నుంచి తిలక్‌నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం హమాలీవాడలో డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. 60 ఫీట్ల రోడ్డు విస్తరణలో ఇళ్లు సగభాగం కోల్పోతున్న బాధితులు తమను ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటానని ఆయన భరోసానిచ్చారు. రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు ఆలస్యం అవుతుండడం పట్ల కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సల్ల శంకర్, పోరెడ్డి రాజు, అబ్దుల్ మాజిద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు పాల్గొన్నారు.



హాజీపూర్‌లో పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనుల పర్యవేక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బుధవారం పర్యవేక్షించారు. మండల కేంద్రంలోని బోక్ల కాలనీలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన మురికి కాలువ వంకరగా నిర్మాణం చేపడుతుండడంతో కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లంపల్లి నిర్వాసితులు తమకు ఇంటి నిర్మాణం కోసం రూ.70 వేలు, రూ.3 లక్షల ప్యాకేజీ ఇప్పించాలని కోరగా.. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ధర్మారంలో పనులు పరిశీలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, ఎంపీటీసీలు ఒడ్డె బాలరాజ్, డేగ బాపు, నాయకులు మాధవరపు రాజేశ్వర్‌రావు, పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, అంకం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నస్పూర్‌లో..

నస్పూర్: పట్టణ పరిధిలోని 23వ వార్డులో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు బుధవారం పరిశీలించారు. డ్రెయిన్ కల్వర్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోళ్లను మింగిన కొండచిలువ హతం



మృతిచెందిన కొండచిలువ, కోడి

నెన్నెల: మండల కేంద్రంలోని చర్చీ సమీపంలో ఉన్న దుర్గం మల్లేష్ ఇంటి ఆవరణలోకి బుధవారం ఓ కొండచిలువ ప్రవేశించింది. రెండు కోడిపిల్లలను మింగింది. మరో కోడిని చుట్టేసి చంపే ప్రయత్నం చేసింది. కోళ్లు బిగ్గరగా అరిచి చెల్లాచెదురు కావడంతో ఇంట్లో నుంచి మల్లేష్ బయటకు వెళ్లి చూశాడు. కొండచిలువ కోడిని పట్టుకుని ఉండడం గమనించాడు. వెంటనే పెద్ద కర్ర తీసుకొని కొండచిలువను హతమార్చాడు. అప్పటికే కోడి మృతిచెందింది. కొండచిలువ ఆరు ఫీట్ల పొడవు, సుమారు 8 కిలోల బరువు ఉంది. ఇప్పటికే 8 కోడిపిల్లలు, నాలుగు కోళ్లు మృతిచెందాయని మల్లేష్ తెలిపాడు.

ఆసుపత్రి పైకెక్కి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేసిన రాజు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పైకెక్కి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మంచిర్యాల పట్టణంలోని ఆండాళమ్మ కాలనీకి చెందిన రాజు కుటుంబ కలహాలతో బుధవారం హెయిర్డై ప్యాకెట్లు తాగడంతో ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. తాను చికిత్స చేయించుకోనని, చనిపోతాననంటూ ఆసుపత్రి భవనం పైకెక్కి కొంత సమయం వరకు అక్కడే ఉన్నాడు. ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు వచ్చి రాజును కిందకు దించి ఆసుపత్రిలో చేర్చారు.

కాళ్ల నొప్పులు భరించలేక ఆత్మహత్య

తానూరు(ముధోల్): కాళ్లనొప్పులు భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అవదుత్వార్ లచ్చిరాం (59) కొంతకాలంగా బోదకాల వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో కాళ్ల నొప్పులు అధికం కావడంతో సర్జరీ చేయించుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం పంటచేనుకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ధర్మాబాద్ రోడ్డులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య గంగాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్తు అలజడి

- జోరుగా గంజాయి విక్రయాలు
- పెరిగిపోతున్న ఆగడాలు



సింగరేణి కళావేదిక పక్కన పాడుబడిన రూమ్‌లో గంజాయి దమ్ముకొడుతున్న ఓ యువకుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీ, చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయి గుప్పుమంటోంది. నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన ఇళ్లు, శివారు ప్రాంతాలను ఎంచుకుని యువత గంజాయి దమ్ము కొడుతోంది. కొందరు మహారాష్ట్ర నుంచి గంజాయిని గుట్టుగా రవాణా చేసి అధిక ధరకు అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. యువకులు, విద్యార్థులకు విక్రయిస్తూ బానిసగా మారుస్తున్నారు. గంజాయి నివారణకు పోలీసులు ఇటీవల కాలంలో కట్టడి చర్యలు తీవ్రతరం చేసి కొందరిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. బానిసగా మారిన యువకులు దమ్ముకొట్టే వ్యసనాన్ని మానుకోలేకపోతున్నారు.

మున్సిపాలిటీ పరిధిలో..

బెల్లంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పలు ప్రాంతాలు గంజాయికి అడ్డాగా మారాయి. రేయింబవళ్లు వ్యసనపరులు దమ్ము కొడుతూ మత్తులో జోగుతున్నారు. సోయి లేకుండా వ్యవహరించడం, కయ్యానికి కాలుదువ్వడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. కన్నాలబస్తీ శివారు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధి, రైల్వేట్రాక్, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద, కొత్తబస్టాండ్ ఏరియా, ప్రభుత్వ పాలిటెక్నిక్ పరిసరాలు, పోశమ్మ చెరువు కట్ట, రవీందర్‌నగర్, సింగరేణి కళావేదిక పక్కన ఉన్న పాడుబడిన క్వార్టర్లు, అంబేద్కర్ భవన్ పరిసరాలు, టీసీఓఏ క్లబ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, రాంగనర్, హన్మాన్‌బస్తీ, నెంబర్ 2 ఇంక్‌లైన్, రైల్వేస్టేషన్ ఏరియా, బజారు ఏరియా, బెల్లంపల్లి బస్తీ, షంషీర్ నగర్, కాంటా చౌరస్తా ఎల్లమ్మగుడి, మామిడి తోటలు గంజాయి స్థావరాలుగా మారాయి. కొందరు యువకులు బాహాటంగానే గంజాయి దమ్ము కొడుతూ రోడ్లపై తచ్చాడడం, రాకపోకలు చేస్తున్న వారిని బెదిరించడం, దౌర్జన్యాలకు దిగడం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు సైతం గంజాయికి ఆకర్షితులైనట్లుగా ప్రచారం జరుగుతోంది.

గ్రామాల్లో..

గంజాయి మత్తు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. బెల్లంపల్లి మండలం మాలగురిజాల, తాళ్ల గురిజాల, రంగపేట, బట్వాన్‌పల్లి, చంద్రవెల్లి, బుధాకుర్దు, బుధాకలాన్, దుగినేపల్లి తదితర గ్రామాలకు విస్తరించినట్లుగా తెలుస్తోంది. భీమిని, కన్నెపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల మండలాల్లోని పలు గ్రామాల్లో కొందరు గంజాయికి అలవాటు పడ్డట్లుగా ప్రచారంలో ఉంది.

ఆగడాలకు వెనుకాడని వైనం

గంజాయి మత్తులో యువకుల ఆగడాలు శృతి మీరుతున్నాయి. ఇంట్లో, బయట గొడవలు చోటు చేసుకుంటున్నాయి. డబ్బు ల కోసం తల్లిదండ్రులను వేధించడం, చేయి చేసుకుంటున్న సందర్భాలు ఉన్నా ఆ విషయాన్ని బయట చెప్పుకోలేక తల్లిదండ్రులు కుములుతున్నారు. శుభకార్యాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడడం, గ్రూపులు కట్టి ఘర్షణకు దిగడం, భౌతికదాడులు చేసుకోవడం సర్వసాధారణంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలు అరికట్టాలని, యువకుల మత్తు వదిలేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు

- బెల్లంపల్లిలో పదిహేను రోజుల క్రితం రెండు వర్గాలుగా విడిపోయిన యువకులు గంజాయి మత్తులో ఘర్షణ పడి కొట్టుకున్నారు.
- బజారు ఏరియా ప్రాంతంలో ఇద్దరు యువకులు 20రోజుల క్రితం గంజాయి తాగి రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న పాదచారుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారు.
- రోజువారీగా చీకటి పడగానే బజారు ఏరియా ప్రాంతంలో గంజాయి దమ్ము కొట్టి బైక్‌పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ తోటి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.
- బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలో ఓ యువకుడు గంజాయికి బానిసగా మారి తల్లిని చావబాది చివరికి తానే ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు.

నిరంతరం నిఘా

గంజాయి క్రయ విక్రయాలు సాగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పట్టుబడితే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. హాట్‌స్పాట్‌లు, నిర్మానుష్య, అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం. గంజాయికి అలవాటు పడిన, అమ్మకాలు సాగిస్తున్న యువకులను బైండోవర్ చేస్తున్నాం. గంజాయితో పట్టుబడిన యువకులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నాం.

– అఫ్జలుద్దీన్, సీఐ బెల్లంపల్లి రూరల్

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ



సరుకుల కిట్‌ను అందిస్తున్న రాజ్‌మహ్మద్

బెల్లంపల్లి: రంజాన్‌ను పురస్కరించుకుని బుధవారం బెల్లంపల్లిలోని వాణినికేతన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి రేగుల అనిల్‌కుమార్ నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నాడు. చదువు పూర్తి చేసి స్వీడన్‌లో స్థిరపడిన అతడు రూ.25 వేలు పంపించి బెల్లంపల్లిలోని తన మిత్రుల ద్వారా నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయించాడు. బజారు ఏరియా, లక్ష్మీపూర్, శాంతిఖని, సుభాష్‌నగర్, కాంట్రాక్టర్ బస్తీ, రాంనగర్ తదితర ప్రాంతాల్లోని పేద ముస్లిం కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.కే.రాజ్‌మహ్మద్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను పంపిణీ చేయించాడు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఏఎస్సై తిరుపతి, ఉపాధ్యాయుడు చక్రపాణి, రమేష్, వెంకటస్వామి, తాజ్‌బాబా సేవా సమితి అధ్యక్షుడు ఉస్మాన్ బాష పాల్గొన్నారు.

ఎస్సైగా మందమర్రి వాసి ఎంపిక



అన్వేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాకు చెందిన అజ్మీర అన్వేష్ సీఐఎస్ఎఫ్ విభాగంలో ఎస్సైగా ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 1475 ర్యాంకు సాధించి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా అర్హత సాధించాడు. పద్మ, శంకర్ దంపతుల కుమారుడైన అన్వేష్ స్థానిక మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు అభ్యసించాడు. తండ్రి శంకర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ చదివించాడు. 2020–23వరకు బీటెక్ చదివిన వెంటనే నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా అన్ని పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే ఎంపికయ్యాడు. బుధవారం మందమర్రికి వచ్చిన అన్వేష్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, సిబ్బంది అభినందించారు. మొదటి ప్రయత్నంలోనే ఎస్సైగా ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉందని అన్వేష్ తెలిపాడు.

‘గిరి’ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రికి వినతిపత్రం అందించారు. శ్రీరాములు మాట్లాడుతూ గిరిజన శాఖలో ఖాళీగా ఉన్న మండల విద్యాధికారులు, ఇతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. గిరిజన ఉపాధ్యాయులకు వసతిగృహాల బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో వారికి గురుకులాల్లో అమలు చేస్తున్న వేతన స్కేల్ అమలు చేయాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, సుధాకర్, ఉద్ధవ్ తదితరులు పాల్గొన్నారు.


‘ఏఐటీయూసీ పోరాటంతోనే ఉచిత బస్సు’



బస్సును ప్రారంభిస్తున్న తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐటీయూసీ పోరాటంతోనే ఏరియా కార్మికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని ఆ యూనియన్ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. సింగరేణి యాజమాన్యం గోలేటి ఎక్స్‌రోడ్ నుంచి ఖైరిగూడ ఓసీపీ వరకు మూడు షిఫ్టుల్లో ఏర్పాటు చేసిన ఉచిత బస్సును బుధవారం ఏఐటీయూసీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ మూడు షిఫ్టుల్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో ఖైరిగూడలో విధులు నిర్వర్తించే కార్మికులు పడే ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు జీఎం రవి ప్రసాద్ చొరవతో బస్సు ప్రారంభమైందన్నారు. ఉచిత బస్సును కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీఎం రవిప్రసాద్, ఖైరిగూడ పీవో సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, రాజేశ్, కిరణ్‌బాబు, శేషశయన రావు, సహాయ కార్యదర్శి ఓదెలు, మైస్స, సేఫ్టీ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, కోటి, నరేశ్, రాజు, రవి, గణేష్, రారాజు, సుధాకర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్కెపల్లిలో ఇల్లు దగ్ధం



బియ్యం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

కాసిపేట: మండలంలోని మల్కెపల్లిలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి కుడిమెత రాంచందర్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో సామగ్రి ఉండగా.. ఇంటి వెనుకాల ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రించడంతో ప్రమాదం తప్పింది. పట్టాపాస్‌పుస్తకం, సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డులు, ఎస్‌ఎస్‌సీ మెమో, రేషన్‌కార్డు, ఓటరుకార్డు, టీవీ, ఫ్రిజ్, మొబైల్‌ఫోన్ ఇతర వస్తువులు కాలిపోయాయి. ఎంఆర్‌ఐ సులోచన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టపోయిన ఆస్తి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు. లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రాంచందర్ కుటుంబానికి తక్షణ సాయంగా రెవెన్యూ శాఖ 50 కిలోల బియ్యం, పప్పు, నూనె, ఇతర సామగ్రి అందించారు.

తిమ్మాపూర్‌లోని స్థలంపై వివాదం

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారులోని సర్వే నంబరు 333, 334లో గల ఓ స్థలంపై ఇరువర్గాల మధ్య బుధవారం వివాదం ఏర్పడింది. ఎన్నో ఏళ్లుగా తమ పరిధిలో ఉన్న భూమికి సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని భూ యజమానులుగా చెప్పుకుంటున్న మరియమ్మ, హనుమయ్య, రాజం, లక్ష్మి తదితరులు విలేకరులతో పేర్కొన్నారు. కాగా ఈ విషయమై ఇరువర్గాల మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం ఏర్పడగా రెవెన్యూ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

నామినేటెడ్ కాదు.. చట్టసభల్లో పదవులు కావాలి

- ఆదివాసీ ఆరు తెగల నేతల డిమాండ్



అభివాదం చేస్తున్న ఆదివాసీ ఆరు తెగల నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: రాజకీయ పార్టీలు ఆదివాసీల్లోని ఒకే తెగకు గుర్తింపునిస్తూ, తమను పట్టించుకోవడం లేదని పర్ధాన్, తోటి, కొలాం, నాయక్‌పోడ్, అంద్, మన్నెవార్ తెగలకు చెందిన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులు కాదని తమకు చట్ట సభల్లో గొంతెత్తే పదవులు కావాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఆరు తెగల ఐక్యవేదిక సమావేశం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఆయా సంఘాల రాష్ట్ర నేతలు హాజరై మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీలు గుర్తింపు నివ్వకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామన్నారు. తాము ఏ తెగకు వ్యతిరేకం కాదని, ఆయా పార్టీలు అన్ని తెగలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అవసరమైతే ఆరు తెగల్లోని ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపేందుకు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఆత్రం భీంరావ్, జడ్కే పాండురంగ్, సట్ల అశోక్, మెస్రం బాపురావ్, ఖమ్ము, నగేశ్, ఆనంద్‌రావ్, భీముడు, సుధాకర్, శంకర్, ప్రేంకుమార్, సొనేరావ్, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



ఆసుపత్రిలో చేర్పించిన కానిస్టేబుల్

జన్నారం: విష కీటకం కుట్టడంతో అర్ధరాత్రి అవస్థలు పడుతున్న ఓ వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించి పోలీసులు ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని తంగళ్లపెల్లి గ్రామానికి డొంగరి కృష్ణకు మంగళవారం అర్ధరాత్రి విషపురుగు కుట్టింది. భయంతో జన్నారానికి వచ్చి ఆసుపత్రి సిబ్బందిని లేపే ప్రయత్నం చేశాడు. కంగారుగా రోడ్డుపై తిరుగుతుండడాన్ని పెట్రోలింగ్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు నీలయ్య గమనించారు. ఆరా తీయగా తనకు విషపురుగు కుట్టిందని, చెమటలు పట్టి తల తిరుగుతున్నట్లు తెలిపాడు. వెంటనే అతడిని ద్విచక్ర వాహనంపై ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రమాదం తప్పిందని వైద్యుడు చెప్పడంతో వేకువజామున 4గంటల ప్రాంతంలో అక్కడి నుంచి వెళ్లినట్లు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

రక్తహీనతతో గర్భిణి మృతి



దూర్ విమలాబాయి(ఫైల్)

సిరికొండ: రక్తహీనతతో గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న ఎక్స్‌రోడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పెందూర్ సాయికిరణ్‌కు గత ఏడాది మేలో ఇచ్చోడ మండలం బాదిగూడకు చెందిన విమలాబాయితో(25) వివాహం అయింది. ఆమె ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. ప్రసవం కోసం ఇటీవల పుట్టింటికి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు 108లో ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్సు ఆమెకు సాధారణ నొప్పులే అని వైద్యం అందించారు. అయితే సాయంత్రం గర్భిణికి కడుపు గట్టిపడిన విషయం కుటుంబ సభ్యులు సిబ్బందికి తెలుపడంతో వెంటనే రిమ్స్‌కు తరలించారు. 108లో రిమ్స్‌కు తరలించేలోగా మృతి చెందినట్లు తెలిపారు. అయితే ఇచ్చోడ పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండి, సకాలంలో వైద్యం అంది ఉంటే విమలాబాయి బతికి ఉండేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యుడు సాగర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. ‘వారం నుంచి నేను సెలవులో ఉన్నా.. అక్కడ ఏం జరిగిందో.. మంగళవారం ఎవరిని ఇన్‌చార్జిగా నియమించారో నాకు తెలియదు..’ అంటూ పేర్కొనడం గమనార్హం. కాగా, తీవ్ర రక్తహీనత, విరేచనాలతో గర్భిణి మృతి చెందినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో మనోహర్ పేర్కొన్నారు.

మహా సంకల్ప పాదయాత్ర ప్రారంభం



దీక్ష భూమి వద్ద సేవాలాల్ మహరాజ్ పల్లకితో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి హెచ్ గ్రామంలోని బంజారా జాతీయ దీక్ష భూమి నుంచి మహారాష్ట్రలోని బంజారా కాశి పొరాదేవి పుణ్యక్షేత్రం వరకు వేలమంది సేవాలాల్ భక్తులు చేపట్టిన మహా సంకల్ప పాదయాత్రను బుధవారం దీక్ష గురువు సద్గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సేవాలాల్ భక్తులు దాదాపు 150 కిలోమీటర్లు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో పాదయాత్ర కొనసాగించాలని తెలిపారు. సేవాలాల్ భక్తులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఉట్నూరు మండలం హస్నాపూర్ గ్రామం వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. మండలంలోని గంగాపూర్, తాడేహత్నూర్ గ్రామాల్లో పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలికారు. పాదయాత్రలో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, మాజీ ఎమ్మెల్యే రేఖశ్యాంనాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరేష్ జాదవ్, ఐటీడీఏ ప్రకాష్, బానోత్ గజానంద్‌నాయక్, తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితోపాటు కొనుగోలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. స్థానిక రాళ్లపేటకు చెందిన ఆల్‌మిల్కర్ శ్యామ్ మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి జిల్లా కేంద్రంలోని యువతకు విక్రయించడానికి తీసుకువచ్చాడు. హమాలీవాడకు చెందిన కారెంగుల అరుణ్‌కు బైపాస్‌రోడ్‌లో విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద లభించిన 500గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, ఆల్‌మిల్కర్ శ్యామ్‌పై గతంలో పీడీ యాక్టు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ బన్సీలాల్, ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి అవమానం



గోనే సంచులతో చుట్టేసిన మల్లేష్ విగ్రహం

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన సీపీఐ శాసనసభ పక్ష మాజీ నేత, దివంగత గుండా మల్లేష్ విగ్రహానికి అవమానం జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు. బజారు ఏరియాలోని మల్లేష్ విగ్రహాన్ని గోనెసంచులతో చుట్టేశారు. ఆలస్యంగా గ్రహించిన సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమొగిలి, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి జీసీ మాణిక్యం, సీపీఐ సీనియర్ నాయకుడు రత్నం రాజం ఆ విషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గోనే సంచులు చుట్టి అవమానిస్తారా అని నిలదీశారు. బుధవారం రాత్రి ఎన్నికల అధికారుల ఆదేశాలతో సిబ్బంది గోనే సంచులను తీసేసి వస్త్రంతో మల్లేష్ విగ్రహాన్ని చుట్టేశారు. ఎన్నికల అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి.